ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

3

శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 27 మే 2025



మంత్రి అచ్చెన్న దిగ్భ్రాంతి..



టెక్కలి, మే 26 (ఆంధ్రజ్యోతి): కంచిలి మండలం సామంతపుట్టుగలో సోమవారం విద్యుత్‌షాక్‌కు గురై ముగ్గురు మృతి చెందడంపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి చెందారు. గ్రామదేవత ఉత్సవాల్లో ఇటువంటి ఘటన జరగడం విచారకరమన్నారు. తనను ఎంతో కలిచివేసిందన్నారు. ఈ సంఘటనపై విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు.

శోకం



ఈశ్వరరావు, కృష్ణ మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- విద్యుదాఘాతంతో ముగ్గురి మృతి
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- మృతుల్లో ఇద్దరు చిన్నారులు
- అమ్మవారి సంబరాలకు వచ్చి ప్రాణాలు కోల్పోయిన వైనం

పొరబాటున స్విచ్ వేశాడంతే! ఘోరం జరిగిపోయింది. పదినిమిషాల్లో మూడు ప్రాణాలు పోయాయి. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. గ్రామదేవతల సంబరాల ఆనందమంతా ఆవిరైపోయింది. ఊరుఊరంతా విషాదంలో మునిగిపోయింది. బాధితుల ఇళ్లన్నీ కన్నీంటిసంద్రమై పోయాయి. కరెంటు ఉన్న వైరుకు చిక్కుకున్న ముగ్గురు బాలలు.. వారిని రక్షించేందుకు వెళ్లిన ఓ యువకుడు.. ఇతన్ని కాపాడేందుకు వెళ్లిన సోదరి.. ఇలా ప్రమాదానికి గురయ్యారు. వీరిలో ఇద్దరు బాలలు, యువకుడు మృతి చెందారు. సోమవారం ఉదయం సామంతపుట్టుగలో ఈ ఘోరం చోటుచేసుకుంది.

కంచిలి, మే 26(ఆంధ్రజ్యోతి):

తొమ్మిది రోజుల పాటు గ్రామ దేవత సంబరాల్లో సంతోషంగా గడిపిన ఆ గ్రామస్థులు మరుసటి రోజు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. గ్రామంలో విద్యుత్ షాక్‌తో ముగ్గురు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిలో ఓ బాలుడి పరిస్థితి విషమంగా ఉంది. మృతి చెందిన వారిలో ఇద్దరు చిన్నారులు, ఓ యువకుడు ఉన్నారు. ఈ ఘటన కంచిలి మండలం తలతంపర పంచాయతీ సామంతపుట్టుగ (చిల్లాపుట్టుగ)లో సోమవారం జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. సామంతపుట్టుగ గ్రామానికి చెందిన చిల్లా ఈశ్వరరావు (28) అనే యువకుడితో అమ్మ వారి సంబరాలు చూసేందుకు వచ్చిన పురుషోత్తపురానికి చెందిన బహడపల్లి నందిని (12), నారాయణపురానికి చెందిన నొలియా కృష్ణ (3) ఇద్దరు చిన్నారులు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందారు. సామంతపుట్టుగలో ఈ నెల 17 నుంచి తొమ్మిది రోజులపాటు గ్రామ దేవత సింధుపత్రాణి సంబరాలు నిర్వహించారు. దీనిలో భాగంగా వీధుల్లో విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. ఈ దీపాలకు ఇళ్ల నుంచే విద్యుత్ సరఫరాను అందించారు. ఆదివారం రాత్రితో సంబరాలు ముగియడంతో వీధుల్లో అమర్చిన విద్యుత్ దీపాలను సోమవారం ఉదయం తొలగించారు. అయితే, బల్బుల కోసం ఏర్పాటు చేసిన ఇనుప వైర్లను (జీ వైర్) మాత్రం తొలగించలేదు. ఉదయం 8.30 గంటలకు ఆ వైర్ల వద్దే పలువురు చిన్నారులు ఆటల్లో మునిగితేలారు. ఈ సమయంలో చిల్లా ఈశ్వరరావు తన ఇంటి నుంచి వీధిలోని విద్యుత్ దీపాలంకరణకు విద్యుత్ సరఫరా జరిగే వైర్లకు సంబంధించిన స్విచ్‌ను అనుకోకుండా వేశాడు. దీంతో ఇనుప తీగకు (మిగతా 4వ పేజీలో..)



ఈశ్వరరావు (ఫైల్)



నందిని మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, కుటుంబ సభ్యులు



విషాదంలో గ్రామస్థులు



ప్రమాదానికి కారణమని భావిస్తున్న ఇనుప తీగ, బల్బులు



గాయపడిన కుమారి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మనోజ్

పోలీస్‌స్టేషన్‌లో సీదిరి హల్‌చల్

- సీఐ తిరుపతిరావుతో వాగ్వాదం
- అరుపులు, కేకలతో రెచ్చిపోయిన వైసీపీ శ్రేణులు
- మాజీ మంత్రి తీరుపై విమర్శలు



సీఐతో వాగ్వాదానికి దిగిన మాజీ మంత్రి సీదిరి

వజ్రపుకొత్తూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు పోలీస్ స్టేషన్ వద్ద మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆదివారం సాయంత్రం హల్‌చల్ చేశారు. ఓ విషయమై సీఐ తిరుపతిరావుతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఆయనకు తోడుగా వైసీపీ శ్రేణులు అరుపులు, కేకలతో రెచ్చిపోయారు. మండలంలోని గరుడభద్ర గ్రామంలో ఆవుల శాల విషయమై స్థానిక టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య తగదా చోటు చేసుకుంది. దీనిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు ఆధ్వర్యంలో పోలీసులు టీడీపీ, వైసీపీ నేతలను విచారిస్తుండగా, విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అప్ప లరాజు వైసీపీ నాయకులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడే ఉన్న సీఐ తిరుపతిరావుతో వాగ్వాదానికి దిగారు. సీఐ కూడా మంత్రికి దీటుగా సమాధానం ఇచ్చారు. దీంతో ఇరువురి మధ్య తీవ్ర వాదోపవాదనలు చోటుచేసుకున్నాయి. వైసీపీ కార్యకర్తలు కూడా అరుపులు, కేకలతో రెచ్చిపోయారు. ఓ చిన్న విషయమై మాజీ మంత్రి సీదిరి పోలీసు స్టేషన్‌కు వచ్చి సీఐతో గొడవకు దిగడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలోనూ చీపురుపల్లి పంచాయతీకి చెందిన వైసీపీ సోషల్ మీడియాకు చెందిన యువకుడ్ని పోలీసుస్టేషన్‌కు విచారణకు పిలవగా, అప్పుడు కూడా అప్పలరాజు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఎస్ఐతో వాగ్వాదానికి దిగారు. తాజాగా, సీఐ తిరుపతిరావుతో గొడవకు దిగారు. ఈ వీడియో సోషల్ మీడియాలో ప్రస్తుతం హల్‌చల్ చేస్తోంది.

చలో మహానాడు

- జిల్లా నుంచి కడపకు టీడీపీ సైన్యం
- అన్ని నియోజకవర్గాల నుంచి బయల్దేరిన కేడర్
- ప్రత్యేక వాహనాల్లో ప్రయాణం





శ్రీకాకుళం నుంచి కారులో బయల్దేరుతున్న టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, వార్డుల ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యే గొండు శంకర్ ఏర్పాటు చేసిన బస్సులో బయల్దేరిన టీడీపీ శ్రేణులు

శ్రీకాకుళం, మే 26 (ఆంధ్రజ్యోతి): సిక్కోలు పసుపుదండు కదిలింది. కడపలో మంగళవారం నుంచి మూడు రోజులపాటు జరగనున్న మహానాడు కార్యక్రమానికి అన్ని నియోజకవర్గాల నుంచి టీడీపీ సైన్యం సోమవారం ప్రత్యేక వాహనాల్లో బయల్దేరి వెళ్లింది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు మహానాడును పర్యవేక్షించే బాధ్యతను అధిష్ఠానం అప్పగించింది. అచ్చెన్న అక్కడ నుంచే పనులు పర్యవేక్షిస్తున్నారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కూడా కడపలోనే ఉన్నారు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని పది నియోజకవర్గాల్లో కూడా కూటమి విజయం సాధించింది. దీంతో అన్ని నియోజకవర్గాలకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు, పార్టీ అనుబంధవర్గ నాయకులు మహానాడులో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో కడపకు తరలివెళ్లారు. మహానాడు వేదికకు ఎదురుగా ఇప్పటికే జిల్లా నాయకుల ఫొటోలతో ప్రత్యేక ఫ్లెక్సీలను నెలకొల్పారు. పీయూసీ ఛైర్మన్ కూన రవికుమార్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, మామిడి గోవిందరావు, గౌతు శిరీష, బగ్గు రమణమూర్తి, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కలమట వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యేలు గుండ లక్ష్మీదేవి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, వార్డు ఇన్ చార్జిలు విభూది సూరిబాబు, ద్వితీయస్థాయి నాయకులు.. ఇలా అత్యధికమంది మహానాడుకు వెళ్లారు.

న్యూస్ బాక్స్

నేటి నుంచి యోగా శిబిరాలు

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర-2025 పేరిట జిల్లాలోని నాలుగు చారిత్రక ప్రదేశాల్లో మంగళవారం నుంచి జూన్ 10 వరకు యోగా శిబిరాలు నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఉదయం 7గంటల నుంచి 8 గంటల వరకు శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. మంగళవారం డచ్ బిల్డింగ్ వద్ద, జూన్ 3న అరసవల్లి సూర్యదేవాలయంలో, 7న శాలిహుండం బౌద్ధ స్థూపాల వద్ద, 10న కళింగపట్నం బీచ్‌లో యోగా శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ శిబిరంలో కనీసం వెయ్యి మంది పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్డీవో సమన్వయాధికారిగా ఉంటారని, అధికారులు సమన్వయంతో ఈ శిబిరాలను విజయవంతం చేయాలని కోరారు.

మీజిల్స్ వ్యాక్సినేషన్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): మీజిల్స్ రూబెల్లా వ్యాక్సినేషన్‌కు ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి కె.అనిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి విడతగా ఈ నెల 26 నుంచి 31 వరకు, రెండో విడత జూన్ 23నుంచి 28వరకు, మూడో విడత జూలై 21 నుంచి 26 వరకు శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మొదటి డోసు 9 నుంచి 12నెలల మధ్య, రెండో డోసు 16నెలల నుంచి 24 నెల మధ్య పిల్లలకు వేస్తామన్నారు. దీనివల్ల పిల్లలకు ఆటలమ్మ, రూబెల్లా వ్యాధులు రాకుండా నివారించవచ్చని నతెలిపారు. అన్ని పీహెచ్‌సీలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఈ శిబిరాలు జరుగుతాయని తెలిపారు.

చివరి చూపు దక్కలే

- నారాయణపూర్‌లో మావోయిస్ట్ చీఫ్ నంబాల అంత్యక్రియలు పూర్తి
- కేశవరావు మృతదేహం కోసం మూడురోజులుగా ఎదురుచూసిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు
- అయినా అప్పగించని పోలీసులు



టెక్కలి, మే 26 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్‌లో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు పార్టీ కమాండర్ ఇన్ చీఫ్ నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు అంత్యక్రియలు సోమవారం పూర్తయ్యాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్‌లో సోమవారం రాత్రి అక్కడి పోలీసులు అంత్యక్రియలు నిర్వహించారు. బంధువులకు మృతదేహాన్ని అప్పగించాలని ఏపీ హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ అక్కడి పోలీసులు అంత్యక్రియలు నిర్వహించడంపై కేశవరావు కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన వెలిబుచ్చారు. బసవరాజు కడసారి చూపునకు ఆయన స్వగ్రామమైన జీయన్నపేట గ్రామస్థులు నోచుకోలేదు.

మూడు రోజులుగా ఎదురుచూపు

- ఏపీ హైకోర్టు ఉత్తర్వులతో కేశవరావు మృతదేహం కోసం మూడురోజుల కిందట ఆయన సోదరుడు రాంప్రసాద్‌తో పాటు మరో ముగ్గురు వ్యక్తులు నారాయణపూర్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ పోలీసులు కేశవరావు మృతదేహం ఇచ్చేందుకు అంగీకరించలేదు. 'మీ జిల్లా పోలీసుల అనుమతి తీసుకొని వచ్చారా?, మీరు కేశవరావు కుటుంబసభ్యులేనా?, లీగల్‌హెయిర్ సర్టిఫికెట్ తెచ్చారా, తాజాగా కేశవరావుతో కలిసి తీసుకున్న ఫొటో ఏదైనా ఉందా.?' అని పలు రకాల ప్రశ్నలు అక్కడి పోలీసులు సంధించారు. సోమవారం కేశవరావు పెద్దసోదరుడు ఢిల్లేశ్వరరావు తమ స్వగ్రామం జీయన్నపేట వెళ్లి గ్రామస్థులు, బంధువులతో మాట్లాడారు. అయితే, ఆయన వెంట పోలీస్ షాడో బృందం ఉంది. కేశవరావు మృతదేహం కోసం పౌరహక్కుల సంఘం నాయకులు మరోమారు సోమవారం హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది. ఈలోపే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్‌లో సోమవారం రాత్రి అక్కడి పోలీసులు కేశవరావు అంత్యక్రియలను పూర్తి చేసేశారు.



నారాయణ్‌పూర్ ఆసుపత్రి వద్ద న్యాయవాది బాలాబాలన్‌తో కేశవరావు కుటుంబసభ్యులు

నేడే ఆఖరు

- ముగియనున్న ఉపాధ్యాయ బదిలీల దరఖాస్తు ప్రక్రియ
- తలెత్తుతున్న సాంకేతిక సమస్యలు
- పరిష్కారానికి ఎంఈవో లాగిన్‌లో అవకాశం
- తరువాత డీఈవో కార్యాలయానికి దరఖాస్తులు



నరసన్నపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి దరఖాస్తు స్వీకరణ ప్రక్రియ మంగళవారంతో ముగియనుంది. అర్ధరాత్రి 12 గంటల వరకు దరఖాస్తు చేసుకునేందుకు ఎస్జీటీలకు అవకాశం కల్పించారు. ఆ తరువాత సర్వర్ ఆగిపోనుంది. ఈనెల 21 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. గ్రేడ్-2 హెచ్‌ఎంలు 121 మంది, స్కూల్ అసిస్టెంట్లు సుమారు 600 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. గ్రేడ్-2 హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్ల దరఖాస్తు పక్రియ దాదాపు ముగిసింది. ఎస్జీటీలకు మాత్రం మంగళవారం అర్ధరాత్రితో ముగియ నుంది. ఉమ్మడి జిల్లాలో అన్ని కేటగిరీలకు చెందిన సుమారు 4,700 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేయనున్నారు. ఎస్జీటీలు వేల సంఖ్యలో ఉండడంతో అంతా ఒకేసారి దరఖాస్తు చేస్తున్నారు. దీంతో సర్వర్ డౌన్ అవుతుండడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దరఖాస్తు సమయంలో ఏర్పడే సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మార్సీ కార్యాలయాల్లో ఎంఈవో లాగిన్‌లో అవకాశం ఇచ్చారు. దీంతో ఉపాధ్యాయులకు కొంత ఊరట లభించింది. దరఖాస్తుతో పత్రాలతో ప్రిఫెరెన్సియల్ కేటగిరీలోని ఉపాధ్యాయులు ఇటీవల మెడికల్ బోర్డు జారీ చేసిన పత్రాలు జత చేయాల్సి ఉంది. అలాగే ఉపాధ్యాయుల సర్వీసు రిజిస్టర్‌లో కూడా నమోదు చేసింది లేదానే విషయాన్ని ధ్రువీకరించిన తరువాత వాటిని ఎంఈవోలు ఆమోదించాల్సి ఉంది. అలాంటి దరఖాస్తులను ప్రత్యేకంగా సిద్ధం చేసి డీఈవో కార్యాలయానికి పంపించాల్సి ఉంది. బదిలీల్లో ఉపాధ్యాయుల ప్రత్యేక కేటగిరీ కోసం అడ్డదారులు తొక్కకుండా ముందుగుండానే అధికారులు చెక్ పెట్టారు. అయినా కొందరు ఉపాధ్యాయులు తమ పలుకుబడి ఉపయోగించుకుని మెడికల్ బోర్డు నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. బదిలీల దరఖాస్తును పునఃపరిశీలన కోసం డీఈవో కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు.

మలగాం భూములకు
మంచిరోజులు
4లో



- లిఫ్ట్ ఇరిగేషన్‌తో సాగునీరు
- ప్రణాళిక సిద్ధం చేస్తున్న అధికారులు

అర్జీల పరిష్కారానికి చర్యలు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- గ్రీవెన్స్‌కు 182 వినతులు

5లో

ధ్రువపత్రాలు తీసుకున్నారా?
- విద్యాలయాల్లో చేరికకు ఇవే కీలకం
- ముందే మేలుకుంటే మంచిది

4లో

నేటి నుంచి ఐదు రోజులపాటు వర్షం 5లో

పదండి పోదాం మహానాడుకు..

● పెద్ద ఎత్తున వాహనాల్లో తరలిన టీడీపీ శ్రేణులు

కడపలో మంగళవారం నుంచి నిర్వహించనున్న టీడీపీ మహానాడు కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు పయనమయ్యారు. సోమవారం బయలుదేరిన వీరి వాహనాలను స్థానిక నాయకులు, కార్యకర్తలు జెండాలు ఊపి ప్రారంభించారు.

-ఆంధ్రజ్యోతి బృందం


నరసన్నపేట: మహానాడుకు బయలుదేరిన టీడీపీ కార్యకర్తలు, నాయకులు


పాతపట్నం: పార్టీ పతాకాన్ని ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న పైల బాబ్జీ


ఆమదాలవలస: మహానాడుకు వెళుతున్న టీడీపీ కార్యకర్తలు


టెక్కలి నుంచి...


ఇచ్ఛాపురం నుంచి...



ఉచితంగా యోగా శిక్షణ

● డ్వామా పీడీ సుధాకర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జూన్ 20వ తేదీ వరకు స్థానిక 80 అడుగుల రోడ్డులో రోజూ ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు ఉచిత యోగా శిక్షణ ఇవ్వనున్నట్టు డ్వామా పీడీ సుధాకర్ పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం 300 మందితో 80 అడుగుల రోడ్డులో శిక్షకులు వారణాశి సందీప్, పాండ్రంకి మురళి, తంగా స్వాతిల ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పరిపూర్ణ ఆరోగ్యానికి, మానసిక వికాసానికి ఈ సాధన ఎంతో ఉపకరిస్తుందని ఆయుష్ వైద్యాధికారి పి.జగదీష్ అన్నారు. మంగళవారం నుంచి మండలస్థాయిలో కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం డచ్ బిల్డింగ్ వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ధ్రువపత్రాలు తీసుకున్నారా?

● విద్యాలయాల్లో చేరికకు ఇవే కీలకం ● ముందే మేలుకుంటే మంచిది


హిరమండలం, మే 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పై తరగతులకు వెళ్లడానికి... ఉన్నత విద్య అభ్యసించేందుకు వివిధ రకాల ధ్రువపత్రాలు అవసరమవుతాయి. ఈ నేపథ్యంలో వాటిని ముందస్తుగా పొందేందుకు ఇదే మంచి తరుణమని అధికారులు చెబుతున్నారు. పాలిటెక్నిక్, జేఈఈ, నీట్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు తదుపరి విద్యా సంస్థల్లో ప్రవేశాలకు కుల, ఆదాయ వంటి ధ్రువపత్రాలు తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. ఈ ఏడాది అధిక సంఖ్యలో విద్యార్థులు వారికి అవసరమైన పత్రాల కోసం రానున్నారన్న సమాచారంతో అందుకు సంబంధించిన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు.

ప్రక్రియ ఇలా...

ధ్రువపత్రాల కోసం విద్యార్థులు మీసేవ కేంద్రాలు, సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థి, తల్లిదండ్రులకు సంబంధించిన ఆధార్, రేషన్ కార్డు, విద్యార్హతల ధ్రువపత్రాలు సమర్పించాలి. సంబంధిత అర్జీ పూర్తి చేసి అవసరమైన జిరాక్స్‌లను సచివాలయంలో సమర్పించాలి. ఆన్‌లైన్ చేసిన అనంతరం వీఆర్వో నేరుగా క్షేత్రస్థాయి పరిశీలన చేసి ఆ వివరాలను ఆన్‌లైన్ దరఖాస్తుకు జత చేసి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు పంపిస్తారు. వాటి ఆధారంగా అవసరమైతే ఫోన్ లేదా నేరుగా వచ్చి పరిశీలించిన అనంతరం తహసీల్దారు లాగిన్‌కు దరఖాస్తు వెళుతుంది. తహసీల్దారు పర్యవేక్షించి డిజిటల్ సంతకం చేస్తారు. అనంతరం దరఖాస్తుదారుడి మొబైల్ నెంబర్‌కు మెసేజ్ వస్తుంది, సచివాలయం లేదా మీ సేవా కేంద్రానికి వెళ్లి ధ్రువీకరణ పత్రం పొందవచ్చు.

ముందస్తుగా చేసుకుంటేనే....

ఏటా మే, జూన్ నెలల్లో తహశీల్దారు కార్యాలయాలపై ధ్రువపత్రాల జారీ విషయంలో ఒత్తిడి ఉంటుంది. వీఆర్వో, ఆర్ఐల క్షేత్ర స్థాయి పరిశీలన, డిజిటల్ సంతకాలు తదితర ప్రక్రియలలో ఆలస్యం అవుతుంది దీంతో అనుకున్న సమయానికి పత్రం కావాలంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడంతో పాటు మధ్యవర్తులను ఆశ్రయించాల్సి వస్తుంది. ముందుగా మేలుకుంటే... సకాలంలో పత్రాలు పొందవచ్చు.



అన్ని ఏర్పాట్లు చేశాం..

ధ్రువపత్రాల మంజూరుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఎప్పటి దరఖాస్తులను అప్పుడే పరిశీలించి త్వరగా పత్రాలు మంజూరు చేయవలసిందిగా సిబ్బందికి ఆదేశాలిచ్చాం. ఏవైనా ఇబ్బందులు వస్తే విద్యార్థులు నేరుగా కలిసి ధ్రువపత్రాలు మంజూరు చేయించుకోండి.

-హనుమంతరావు, తహసీల్దారు, హిరమండలం

అర్జీదారుల సంతృప్తే లక్ష్యం

● ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి
● ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, మే 26 (ఆంధ్రజ్యోతి): అర్జీదారులు సంతృప్తి చెందేలా ప్రజా ఫిర్యాదులను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమంలో ఆయన జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 62 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను స్వయంగా తెలుసుకుని... పూర్తి స్థాయిలో పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వాటి వివరాలను సంబంధిత పోలీసు అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తెలియపరచి... చట్ట ప్రకారం పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి, బాధితులకు న్యాయం చేయాలన్నారు. వృద్ధులు, వికలాంగుల వద్దకు ఎస్పీ స్వయంగా వెళ్లి.. అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను ఓపికగా తెలుసుకున్నారు.


అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి


తన ఇద్దరు బిడ్డలతో ఎస్పీ గ్రీవెన్స్ వద్ద మహిళ

నడిరోడ్డుపై భర్త వదిలేశాడని..

ఇద్దరు పిల్లలతో సహా తనను భర్త ఎర్ర శంకరరావు వదిలేశాడని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డికి మంగమ్మ అనే మహిళ సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ లావేరు మండలం సిగురుకొత్తపల్లి గ్రామానికి చెందిన ఎర్ర శంకరరావు అనే వ్యక్తితో 2019లో తనకు వివాహమైందని తెలిపారు. ఇటీవల కాలంలో కులం పేరుతో గొడవల కారణంగా ఏప్రిల్ 28న సిగురు కొత్తపల్లిలో గల ఇంటికి వెళ్దామని చెప్పి, తీసుకువెళ్లిన భర్త శంకరరావు... తనను, ఇద్దరు పిల్లలను సుభద్రాపురం జంక్షన్‌లో రాత్రి 8.30 గంటల సమయంలో నడిరోడ్డుపై వదిలేసి వెళ్లిపోయాడని ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఎంతసేపటికీ తన భర్త రాకపోవడంతో తాను లావేరు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశానన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు, ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆమె వాపోయారు. తనకు న్యాయం చేసి ఆదుకోవాలని ఆమె ఎస్పీని కోరారు.

ఘోరం

(మూడో పేజీ తరువాయి)

విద్యుత్ సరఫరా జరగడంతో అక్కడ ఆడుకుంటున్న నొలియా కృష్ణ, బహడపల్లి నందిని, పొడియా మనోజ్ అనే చిన్నారులు షాక్‌కు గురయ్యారు. ఇది గమనించిన ఈశ్వరరావు వెంటనే తన మేనల్లుడు కృష్ణను రక్షించే క్రమంలో వైర్లను తప్పించేందుకు, వాటిని పట్టుకున్నాడు. దీంతో షాక్‌కు గురై ఆయనతో పాటు చిన్నారులు కృష్ణ, నందిని మృతి చెందారు. మరో బాలుడు మనోజ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదాన్ని చూసి స్థానికులు కేకలు వేయడంతో ఇంటి పెరట్లో ఉన్న ఈశ్వరరావు అక్క కుమారి, మరో వ్యక్తి చిల్లా తరిణీ పరుగున వచ్చి చిన్నారులను కాపాడేందుకు ప్రయత్నించగా వారు సైతం షాక్‌కు గురై గాయపడ్డారు. దీంతోవెంటనే స్థానికులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అంతా పదినిమిషాల్లో జరిగిపోయింది. తీవ్రంగా గాయపడిన మనోజ్‌ను సోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండటంతో సోంపేట నుంచి బరంపురం తరలించారు. సమాచారం తెలుసుకున్న పలాస డీఎస్పీ వెంకటఅప్పారావు, సోంపేట సీఐ మంగరాజు, కంచిలి ఎస్ఐ పారినాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అలాగే, తహసీల్దార్ రమేష్ కుమార్, ఎలక్ట్రికల్ ఏడీ ఎం.రవి, ఏఈ గురవయ్య గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పారినాయుడు తెలిపారు.


గ్రామస్థుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

తండ్రితో వెళ్లుంటే నందిని బతికేదేమో..

విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన పురుషోత్తపురం గ్రామానికి చెందిన బహడపల్లి నందిని కంచిలి ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. అమ్మవారి సంబరాలు చూసేందుకు సామంతపుట్టుగలోని తన పిన్ని గారింటికి తల్లిదండ్రులతో కలిసి వచ్చింది. ఆదివారం రాత్రే ఆమె తల్లిదండ్రులు తిరిగి పురుషోత్తపురం వెళ్లిపోయారు. తమతో పాటు వచ్చేయమని తండ్రి దీనబంధు కుమార్తె నందినిని పిలిచాడు. సోమవారం వస్తానని పిన్ని వద్దే ఉండిపోయింది. తండ్రి పిలిచినప్పుడు వెళ్లిపోయుంటే చిన్నారి బతుకుండేదంటూ గ్రామస్థులు కన్నీటిపర్యంతమయ్యారు.

నెలలో వివాహం కావాల్సి ఉండగా..

మరో మృతుడు చిల్లా ఈశ్వరరావు శ్రీకాకుళం సమీపంలోని ఓ హోటల్‌లో చెఫ్‌గా పని చేస్తూనే, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. కవిటి మండలం బల్లిపుట్టుగకు చెందిన అమ్మాయితో ఈశ్వరరావుకు పెళ్లి నిశ్చయమైంది. వచ్చే నెల జూన్‌లో వివాహం కావాల్సి ఉంది. గత ఏడాదే పెళ్లి జరగాల్సి ఉండగా ఈశ్వరరావు బావ, అనంతరం తల్లి మృతి చెందడంతో వివాహం వాయిదాపడుతూ వచ్చింది. అమ్మవారి సంబరాలు అనంతరం వివాహానికి ముహూర్తం తీద్దామని అనుకున్నారు. ఈలోగా ఈ ఘోరం జరిగిపోయింది. మేనల్లుడిని కాపాడుకోవడానికి తన ప్రాణం కోల్పోయాడంటూ కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు అందరినీ కలచివేసింది.

వారం కిందటే వచ్చారు..

నారాయణపురం గ్రామానికి చెందిన నొలియా జగబందు తన భార్య లక్ష్మి, కుమారుడు కృష్ణ, కుమార్తె కాంచనతో కలిసి బెంగళూరు నుంచి సామంతపుట్టుగలోని తన బంధువుల ఇంటికి వారం కిందటే వచ్చాడు. అమ్మవారి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అయితే, విద్యుదాఘాతంతో కుమారుడు కృష్ణ మృతి చెందడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. జగబందు బెంగళూరులోని ఓ కర్రల మిల్లులో పని చేస్తున్నాడు.

మలగాం భూములకు మంచిరోజులు

● లిఫ్ట్ ఇరిగేషన్‌తో సాగునీరు
● ప్రణాళిక సిద్ధం చేస్తున్న అధికారులు


రొక్కంపేట వద్దనున్న గరీబుల గెడ్డ


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

సంతబొమ్మాళి, మే 26(ఆంధ్రజ్యోతి): మలగాం పంచాయతీ శివారు భూములకు సాగునీరు అందించేందుకు ప్రణాళిక సిద్ధమైంది. ఏటా ఖరీఫ్‌లో సకాలంలో వంశధార కాలువ ద్వారా సాగునీరు అందక ఈ ప్రాంత రైతులు అవస్థలు పడుతున్నారు. వీరి కష్టాలు తీర్చేందుకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రణాళిక సిద్ధం చేశారు. వంశధార 27టి ఉదయపురం కాలువ ద్వారా ఈ ప్రాంతంలోని 1200 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. ఈ ప్రాంతం వంశధారకు శివారు కావడంతో నీరు సరిగా అందడం లేదు. గరీబుల గెడ్డ ద్వారా సముద్రంలో వృథాగా కలిసిపోతున్న వరద నీటిని లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఉదయపురం కాలువ కు మళ్లించడం ద్వారా రైతులకు సాగునీటి కష్టాలు తీరుతాయని... లిఫ్ట్ ఇరిగేషన్ సౌకర్యం కల్పించాలని మలగాం మాజీ సర్పంచ్ బుచ్చ మురళీకృష్ణ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన మంత్రి... ఏపీఎస్ఐడీసీ శాఖ డీఈ కామరాజు, ఏఈ మధుసూదనరావు, లిఫ్ట్ ఇరిగేషన్ జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్‌లతో చర్చించారు. ఈ ప్రాంతంలో లిఫ్ట్ ఇరిగేషన్ సాధ్యాసాధ్యాలపై చర్చించాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో సంబంధిత అధికారులు ఆ ప్రాంతంలో ఇటీవల పర్య టించారు. బోరుభద్ర పంచాయతీ రొక్కం పేటలో గరీబుల గెడ్డ వద్ద హెడ్ వర్క్, పంప్ హౌస్ నిర్మాణం చేపట్టాలని యోచి స్తున్నారు. అక్కడి నుంచి ఉదయపురం కాలువకు సన్యాసినాయుడు అక్విడెక్ట్ వద్ద కు గరీబుల గెడ్డ నీటిని తీసుకురావాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఉదయపురం కాలువ ద్వారా గొదలాం, మలగాం, సీపురం, గంటపేటతో పాటు మరో పది గ్రామాల్లోని వెయ్యి ఎకరాలకు సాగునీరు అందిచ్చవచ్చని నిర్ధారణకు వచ్చారు. దీనిపై డీపీఆర్ సిద్ధం చేసి... రాష్ట్ర నీటి పారుదల చీఫ్ ఇంజనీర్‌కు పంపనున్నారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తయితే ఈ ప్రాంత రైతుల సాగునీటి కష్టాలు తీరనున్నాయి.

రైతుల కష్టాలు తీరుతాయి..



గరీబుల గెడ్డ వరదనీటిని లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఉదయపురం కాలువకు మళ్లించడం ద్వారా ఈ ప్రాం త రైతుల సాగునీటి కష్టాలు తీరుతాయి. సాగునీటి సమస్యను మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లాం. సంబంధిత అధికారులు వచ్చి స్థలాన్ని పరిశీలించారు.

-బుచ్చ మురళీకృష్ణ, మాజీ సర్పంచ్, మలగాం

శాశ్వత పరిష్కారం చూపాలి..



ఏటా ఖరీఫ్‌లో ఉదయపురం కాలువ ద్వారా సాగునీరు సకాలంలో రాక వేలాది రూపాయలు నష్టపోతున్నాం. ఏటా నాట్లు వేయడం... సకాలంలో సాగునీరు రాక వరినాట్లు ఎండిపోవడం పరిపాటిగా మారింది. సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

-దుప్పట్ల కృష్ణ, రైతు

స్థలాన్ని పరిశీలించాం..

మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుకు ఇంజినీరింగ్ అధికారులతో కలసి స్థలాన్ని పరిశీలించాం. దీనిపై డీపీఆర్ సిద్ధం చేసి.. నీటి పారుదల శాఖ ఛీఫ్ ఇంజనీర్‌కు పంపుతున్నాం. సాధ్యాసాధ్యాలపై మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లాం.

-పి.శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌చార్జి, లిఫ్ట్ ఇరిగేషన్

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించొద్దు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 26(ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయొద్ద, లేకుంటే మోదీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అమ్మన్నాయుడు అన్నారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కోసం కేంద్రంలోని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, తన కుట్రలు మానుకోవాలన్నారు. ఎంతోమంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ను కార్పొరేట్లకు అప్పగించాలనుకోవడం సరికాదన్నారు. విశాఖ స్టీల్‌కు సొంత గనులను సమకూర్చాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఎం.ఆదినారాయణమూర్తి, అల్లు సత్యనారాయణ, కె.సూరయ్య, చిక్కాల గోవిందరావు, ఆర్.ప్రకాశరావు, ఎం.గోవర్ధన రావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం

ఎచ్చెర్ల, మే 26(ఆంధ్రజ్యోతి): అరిణాం అక్కివలస పరిధిలోని శ్యాంపిస్టన్స్ ప్లాంట్-3లో పనిచేస్తున్న కార్మికుడు రెడ్డి సూర్యారావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. కార్మికుల నుంచి వసూలు చేసిన రూ.1,07,500 అతడి భార్య రెడ్డి బాలకు సోమవారం కార్మిక సంఘ నేతలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వీ రమణ మాట్లాడుతూ.. తోటి కార్మికుని కుటుంబం కష్టాల్లో ఉంటే మిగిలిన కార్మికులంతా ఆదుకోవడం మంచి సంప్రదాయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.సూర్యనారాయణ, ఎల్.నాగరాజు, కె.నరేష్, పి.సంతోష్, ఎస్.శ్రీను, పి.శ్రీను పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో..

బూర్జ, మే 26(ఆంధ్రజ్యోతి): లక్కుపురం గ్రామానికి చెందిన పొదిలాపు చంద్రమ్మ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందింది. దీంతో ఆ గ్రామానికి చెందిన మదర్ థెరిస్సా, స్వామి వివేకానంద యువజన సేవా సంఘం సభ్యులు సోమవారం ఆకుటుంబాన్ని పరామర్శించి రూ.16,500 సాయాన్ని అందించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, యువత పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లను తొలగించండి

ఇచ్ఛాపురం, మే 26(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధి పురుషోత్తపురం పాత చెక్‌పోస్ట్ జాతీయ రహదారిపై ఉన్న స్పీడ్ బ్రేకర్లు తొలగించాలని నేస్తం(ఎన్‌జీవో) స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కట్టా సూర్యప్రకాష్ కోరారు. ఈ మేరకు మునిసిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌ను సోమవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఇక్కడ చెక్‌పోస్టు ఉన్నందున స్పీడ్ బ్రేకర్లు అవసరం ఉండేదని.. ప్రస్తుతం చెక్‌పోస్టు లేనందున స్పీడ్ బ్రేకర్లు అవసరం లేదన్నారు. తరచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని, అందువల్ల వీటిని తొలగించాలని కోరారు. అలాగే రైల్వే స్టేషన్ మునిసిపల్ రోడ్ నుంచి స్టేషన్‌కు వెళ్లే రహదారిని అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో రైల్వే యూజర్స్ కమిటీ సభ్యులు సూర్యప్రకాష్, పి.గోపి, ప్రఫుల్‌కుమార్ పండా తదితరులు పాల్గొన్నారు.

మృతదేహాలు అప్పగించకపోవడం అమానుషం



మాట్లాడుతున్న సంఘ నాయకులు

అరసవల్లి, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రజాపోరాటంలో అశువులు బాసిన నంబాళ్ల కేశవరావు, ఇతరుల మృతదేహాలను ఇంతవరకు వారి బంధువులకు అప్పగించకపోవడం అమానుషమని పౌర సంఘాల రాష్ట్ర నాయకులు నంబూరి శ్రీమన్నారాయణ, కె.రవి అన్నారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. తక్షణమే కేశవరావు మృతదేహాన్ని అతడి బంధువులకు అప్పగించాలని, అంత్యక్రియలు చేయడానికి కూడా ప్రభుత్వం అడ్డుపడడం సరికాదన్నారు. నాగరిక మానవ సమాజంలో ఇంతకంటే ఘోరమైన చర్యల మరొకటి ఉండదని విమర్శించారు. యుద్ధంలో పట్టుబడిన శత్రు సైనికుడినైనా తిరిగి ఆ దేశానికి అప్ప గిస్తారు. కానీ ఈ దేశ పౌరుడైన వ్యక్తి పార్థివదేహాన్ని బంధువులకు అప్పగించాలని కోర్టులు ఆదేశించినా ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. కగార్ పేరుతో అమాయక ఆదివాసీలను మావోయిస్టుల పేరుతో అమానుషంగా చంపడం ఆపాలి అని డిమాండ్ చేశారు.

నేటి నుంచి ఐదు రోజులపాటు వర్షం

శ్రీకాకుళం, మే 26(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం నుంచి ఐదురోజుల పాటు జిల్లాలో వర్షాలు కురవనున్నట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. రోహిణీ కార్తె ప్రభావంతో కొద్దిరోజులుగా పగటిపూట ఉక్కపోత.. సాయంత్రానికి వర్షం కురుస్తుంది. ఇప్పుడు బంగాళాఖాతంలో అల్పపీడనం.. దీనికి నైరుతీ రుతుపవనాలు తోడవడంతో ఈనెల 27 నుంచి 31 వరకు వాతావరణంలో స్పష్టమైన మార్పులు ఉంటాయని వాతావరణశాఖ పేర్కొంది. ప్రతిరోజూ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం.. ఆపై గంటకు నలభై నుంచి యాభై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయనున్నాయని నివేదికలో వెల్లడించింది. జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

పశుసంవర్ధక శాఖలో 'నియామక' వివాదం

శ్రీకాకుళం, మే 26(ఆంధ్రజ్యోతి): జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ఓ అధికారి నియామకంపై వివాదం నెలకొంది. ఈశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన పి.సూర్యంపై సస్పెన్షన్ వేటు పడింది. అనంతరం సస్పెన్షన్‌ను ఎత్తివేసి విజయనగరం జిల్లా తెర్లాంలో పోస్టింగ్ ఇచ్చారు. అకారణంగా సస్పెన్షన్ చేశారంటూ సూర్యం కోర్టును ఆశ్రయించారు. ఇదిలా ఉండగా... తనకు కోర్టు ఉత్తర్వులు అనుకూలంగా వచ్చాయంటూ జిల్లా పరిషత్‌లో గ్రీవెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను సోమవారం సూర్యం కలిసి మాట్లాడారు. ఆ తర్వాత జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ షీప్ డవలప్‌మెంట్ ప్రాజెక్టు (ఐఎస్‌డీపీ)లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా విధుల్లో చేరారు. ఈమేరకు తాను కలెక్టర్‌తో మాట్లాడిన వీడియోను, బాధ్యతలు స్వీకరించినట్లు వీడియోను.. మీడియాకు విడుదల చేశారు. అయితే జిల్లా పశుసంవర్ధక సంయుక్త సంచాలకులు (జాయింట్ డైరెక్టర్) కె.రాజగోపాలరావు ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐఎస్‌డీపీలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా సూర్యం నియామకానికి ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు తనకు అందలేదని, కలెక్టర్‌కు కూడా సరైన సమాచారం సూర్యం ఇవ్వలేదని ఆయన ఓ ఒక ప్రకటన జారీచేశారు. ప్రభుత్వ ఆదేశాలు లేకుండానే సూర్యం బలవంతంగా విధుల్లో చేరారంటూ సీసీ ఫుటేజీలను రెండో పట్టణ సీఐ ఈశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. సూర్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ మహేశ్వరరెడ్డికి కూడా జేడీ ఫిర్యాదు చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఇచ్ఛాపురం, మే 26(ఆంధ్రజ్యోతి): యోగతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని తహసీల్దార్ ఎస్.వెంకటరావు, ఎంపీడీవో రామారావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో అధ్యక్షతన తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో యోగపై శిక్షణ అందించారు. యోగ గురువు సంజయ్‌రెడ్డి యోగాసానాలు వేయించి, వాటి ప్రాధాన్యతను వివరించారు. సుమారు 100మంది వరకు పాల్గొని సాధన చేశారు. కార్యక్రమంలో ఆయుర్వేదిక్ డాక్టర్ ప్రేమ్‌కుమార్ జన్నా, డీటీ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- గ్రీవెన్స్‌కు 182 వినతులు

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 26(ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చినవారి నుండి 186 అర్జీలను స్వీకరించారు. తొలుత శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీల పరిష్కారంలో అలసత్వానికి తావులేదని, ప్రభుత్వం అత్యంత ప్రాధన్యం ఇస్తోందని, అధికారులను తమ పరిధిలోని అర్జీలను స్వయంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారించి అర్జీదారులు సంతృప్తి చెందేలా పరి ష్కారాన్ని చూపాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ ఎం.పద్మావతి, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఇతర జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోబీఘాట్‌ను కూల్చేయొద్దు

తమకు జీవనోపాధి కల్పిస్తున్న రేవులో పార్కు నిర్మాణం కోసం దోబీఘాట్‌ను కూల్చవద్దని బలగకు చెందిన భద్రమ్మతల్లి రజక కుల సంక్షేమ సంఘ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం జడ్పీలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘ ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం మాట్లాడుతూ.. పార్కును నిర్మిస్తే, దోబీఘాట్‌ను నమ్ముకుని జీవిస్తున్న వందల కుటుంబాలు ఉపాధి కోల్పోతాయని, వరదల సమయంలో కులవృత్తి కష్టమవుతుందన్నారు. దోబీఘాట్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సింది పోయి, తమ జీవనాధారాన్ని తొలగించడం సమంజసం కాదన్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

యాజమాన్యమే జీతాలు చెల్లించాలి

- కలెక్టర్‌కు విన్నవించుకున్న ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు



జడ్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 26(ఆంధ్రజ్యోతి): గత 20ఏళ్లుగా ఆర్టీసీలో విధులు నిర్వర్తిస్తున్నామని, కానీ నేటికీ ఔట్‌సోర్సింగ్ విధానంలోనే కొనసాగిస్తున్నారని, ఇప్పటికైనా యాజమాన్యమే జీతాలు చెల్లించాలని కోరుతూ ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. థర్డ్‌పార్టీ కాంట్రాక్టర్లు కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐలు సక్రమంగా చెల్లించడం లేదని, ఈఎస్‌ఐ కార్డులు కూడా ఇవ్వడం లేదని అన్నారు. జీతాల నుంచి అదనంగా రూ.1000 నుంచి రూ.3000 వరకు కార్మికుల దగ్గర నుంచి వసూలు చేసి శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికశాఖ నిబంధనలను తమకు వర్తింపజేయాలని, పండగ సెలవులు, మహిళలకు మెటర్నిటీ లీవులు కల్పించాలని, ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని కోరారు.

ఘనంగా అమావాస్య పూజలు



స్వామివారికి నైవేద్యంగా వివిధ రకాల పిండి వంటకాలు, పండ్లు

ఇచ్ఛాపురం, మే 26(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి కస్పాగౌడ వీధిలో కొలువుతీరిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సోమవారం అమావాస్య పూజలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా వివిధ రకాల పిండి వంటకాలు, పండ్లతో నైవేద్యం సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు.

- కవిటి, మే26(ఆంధ్రజ్యోతి): బొరివంక గ్రామంలో గల రామలింగేశ్వర స్వామి ఆలయంలో వలసావిత్రి అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆలయ పూర్వ అర్చకులు విశ్వనాథ్ రౌలో ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అంబామాస్య ప్రారంభం కావడంతో పండు, ఫలాలను తీసుకొచ్చి నైవేద్యంగా సమర్పించారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు శతశాతం ప్లేస్‌మెంట్



ప్రిన్సిపాల్స్ నారాయణరావు, జానకిరామయ్యతో ఎంపికైన విద్యార్థులు

ఎచ్చెర్ల, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం)లో 2024-25 విద్యా సంవత్సరంలో రిలీవ్ అయిన 262 మంది విద్యార్థులు శతశాతం వివిధ కంపెనీల్లో ప్లేస్‌మెంటు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.జానకిరామయ్య తెలిపారు. కళాశాల ఆవరణలో సోమవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ఉద్యోగ విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కళాశాలలో సివిల్, మెకానికల్, కంప్యూటర్స్, ఎలక్ట్రికల్, డీసీసీపీ బ్రాంచ్‌ల్లో మొత్తం 262 మంది రిలీవ్ కాగా, వీరంతా ఉద్యోగాలు సాధించారని వివరించారు. వీల్స్ ఇండియా, హెచ్‌ఎంటీ ఇంజనీరింగ్ సర్వీసెస్, మారుతి సుజికి, రోయల్ ఎన్‌ఫీల్డ్, టెక్నిక్స్ టీఎస్‌ఎల్ తదితర కంపెనీల్లో ఉద్యోగాలు పొందారన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు కళాశాల ఆవరణలో వివిధ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశాఖ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు పూర్తిచేసిన వారికి ఉజ్వల భవిత ఉందన్నారు. ఈ కళాశాలకు చెందిన మొత్తం విద్యార్థులంతా వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు.టకార్యక్రమంలో కళాశాలలోని వివిధ బ్రాంచ్‌ల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేడుకగా హనుమాన్ జలయాత్ర



నది ఒడ్డున ప్రార్థనలు



కలశాలతో వస్తున్న మహిళలు

ఇచ్ఛాపురం, మే 26(ఆంధ్రజ్యోతి): స్థానిక గొల్లవీధి సమీపంలో గల సత్యసాయి మందిరం పక్కన నూతనంగా నిర్మించిన ధ్యానాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు ఆధ్వర్యంలో జలయాత్రను ఘనంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం సుమారు 500 మంది మహిళలు ఒకే రకమైన చీరలు ధరించి... బాహుదా నది వద్దకు ఊరేగింపుగా చేరుకున్నారు. నదీ తీరాన దాసరి నారాయణరావు దంపతులతో పాటు తొమ్మిది జంటలతో వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బిందెలతో నదీ జలాలను పట్టుకొని మహిళలు కాలినడకన విగ్రహం వద్దకు చేరుకున్నారు. మంగళవారం నదీ జలాలతో స్వామికి అభిషేకం చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

నేటితో ముగియనున్న ఏపీ ఈఏపీ సెట్

ఎచ్చెర్ల, మే 26(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీ సెట్-2025 మంగళవారంతో ముగియనుంది. జిల్లాలోని శ్రీ శివానీ, శ్రీ వెంకటేశ్వర, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలు, కోర్ టెక్నాలజీ కేంద్రాలల్లో ఈ నెల 19వ తేదీ నుంచి ఈ పరీక్షలు జరుగుతున్నాయి. సోమవారం శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో రెండు షిఫ్ట్‌ల్లో కలిపి 559కు 539 మంది, శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో 343కు 330 మంది హాజరయ్యారు.

డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆమదాలవలస, మే 26(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిధిలో నిర్వహించే వ్యవసాయ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు విశ్వ విద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసిందని, అర్హులైన, ఆసక్తి ఉన్న విద్యార్థులు వ్యవసాయ డిప్లొమా కోర్సులు చదివేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని తొగరాం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీపాన నీలవేణి ఒక ప్రకటనలో సోమవారం పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొనేవారు ఈ నెల 28న నుంచి జూన్ 16వ తేదీ వరకు సమయం ఉందన్నారు. ఈ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు పదో తరగతి పాసై ఉండాలన్నారు. దరఖాస్తులను డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు.ఏఎన్‌జీఆర్ఏయు.ఏసీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేయాలన్నారు. సందేహాల నివృత్తికి ఆమదాలవలస వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల కార్యాలయంలో పని వేళల్లో సంప్రదించాలన్నారు. దూర ప్రాంతం వారు 7702394824 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

యోగాంధ్ర-25 పోటీలు

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర -25 పేరిట రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగ పోటీలు మే 26 నుంచి ప్రారంభమవుతాయని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ వెల్లడించారు. గ్రామస్థాయిలో మొదలయ్యే ఈ పోటీలు మండల, జిల్లా స్థాయిలో కొనసాగి, చివరికి రాష్ట్రస్థాయి గ్రాండ్ ఫైనల్ వరకు కొనసాగుతాయని తెలిపారు.

డిగ్రీ స్పెషల్ డ్రైవ్ పరీక్షలు

ఎచ్చెర్ల, మే 26(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల్లో 2015-16 విద్యా సంవత్సరంలో చదివి పూర్తిచేయలేని విద్యార్థులకు స్పెషల్ డ్రైవ్ పరీక్షలు సోమవారం వర్సిటీ కేంద్రంగా ప్రారంభమయ్యాయి. ఉదయం డిగ్రీ మొదటి సెమిస్టర్, రెండో పూట మూడో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా 2019 విద్యా సంవత్సరంలో డిగ్రీలో చేరి సబ్జెక్టులు ఉండిపోయిన విద్యార్థులకు కూడా ఈ పరీక్షలు రాసేందుకు అవకాశం ఇచ్చారు. 1,3 సెమిస్టర్ల స్పెషల్ డ్రైవ్ పరీక్షలు జూన్ 9వ తేదీ వరకు జరుగుతాయి. అలాగే జూన్ 10 నుంచి 23వ తేదీ వరకు డిగ్రీ 5,6 సెమిస్టర్ల స్పెషల్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం 2,4 సెమిస్టర్ల పరీక్షలు నిర్వహించనున్నారు.

శ్మశానవాటిక ఆక్రమణ తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి, మే 26 (ఆంధ్రజ్యోతి): మూలసవలాపురం గ్రామ శ్మశాన వాటిక ఆక్రమణను సోమవారం అధికారులు తొలగించారు. సర్పంచ్ తర్లాడ ఈశ్వరరావు ఈ శ్మశాన వాటిక ఆక్రమణపై ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు జరిగింది. కలెక్టర్ ఆదేశాలతో ఎంపీడీవో ఎం.పావని మండల సర్వేలు గ్రామ పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో పోలీసులు గ్రామానికి చేరుకొని ముందుగా శ్మశానవాటిక హద్దులను నిర్ణయించి తదుపరి జేసీబీ సాయంతో ఆక్రమణ గట్టులను తొలగించడం జరిగింది. దీనిపై సర్పంచ్ ఈశ్వరరావు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన శ్మశాన వాటిక స్థలం సర్వే నెంబరు 13లో 2.52 ఎకరా ల్లో స్థలం ఉండేదన్నారు. అయితే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు శ్మశాన స్థలాన్ని కూడా ఆక్రమించి పొలాలుగా అనుభవించడం ప్రారంభించడంతో శ్మశాన వాటిక లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వచ్చింద న్నారు. మనిషి చివరి దశ ప్రాణం పోయిన తర్వాత శవాన్ని దహన పర్చడానికి కూడా స్థలం లేని పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనితో గ్రామ పంచాయతీ తరఫున కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారులు చర్యలు తీసుకొని ఆక్రమణలు తొలగించారన్నారు. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే కూన రవి కుమార్ మంజూరు చేసిన నిధులతో శ్మశాన వాటికకు రహదారి కూడా కొంతదూరం వేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఆ క్రమణలు తొలగించి శ్మశాన వాటికస్థలం పూర్తిస్థాయిలో అధికారులు అందిస్తే రహదారితో పాటు ప్రహరీ నిర్మాణం దహన సంస్కారాల షెడ్ ఇతర నిర్మాణాలు చేపట్టనున్నట్టు సర్పంచ్ ఈశ్వరరావు తెలిపారు.

ప్రమాదమని తెలిసినా..



నరసన్నపేట, మే 26(ఆంధ్రజ్యోతి): భారీ వాహనాలు వస్తువులను తీసుకువెళ్లే సమయంలో ఎటువంటి జాగ్రత్తలు పాటించడం లేదు. సోమవారం నరసన్నపేట పట్టణం నుంచి పెద్ద పైపులతో లారీ ప్రమాదకరంగా వెళుతుండడం కనిపించింది. పొడుగాటి పైపులు లారీలో వేసుకుని వెళ్లినప్పటికీ వెనుక భాగంలో ఎటువంటి ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయలేదు. పైపులు ఊగుతూ ఉండడంతో వెనుక నుంచి వచ్చే ఇతర వాహనాలు, వాహనదారులు ఏ మాత్రం అజాగ్రత్తగా వెళ్లినా ప్రమాదం జరిగే అవ కాశం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు ఇటువంటి వాహనాలపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కొట్లాట కేసులో ఆరుగురిపై కేసు నమోదు

వజ్రపుకొత్తూరు, మే 26(ఆంధ్రజ్యోతి): గరుడుభద్ర గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగిన కొట్లాట కేసులో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.నిహార్ సోమవారం తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. గరుడుభద్ర గ్రామంలో తుఫాన్ రక్షిత భవనం సమీపంలోని ప్రభుత్వం స్థలంలో గూడ ధనరాజు ఆవులశాల వేస్తుండడంతో స్థానిక టీడీపీ నాయకులు కొంచాడ మోహనరావు, రెయ్యి విజయలక్ష్మి, ధర్మారావు, కూర్మారావు అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన గూడ ధనరాజుతోపాటు మరికొంతమంది టీడీపీ శ్రేణులపై కర్రలతో దాడి చేశారు. టీడీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గౌడ ధనరాజు, లక్ష్మి, సిద్ధూ, సుధాకర్, భాస్కరరావు, జగ్గారావులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నిహార్ తెలిపారు.

కార్పెంటర్ అదృశ్యం

శ్రీకాకుళం రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): ఒప్పంగి గ్రామానికి చెందిన కార్పెంటర్ అదృశ్యమైనట్టు రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒప్పంగి గ్రామంలో కార్పెంటర్‌గా జీవనం సాగిస్తున్న ధమరసింగు సతీష్‌కుమార్(30) ఈ నెల 24 నుంచి కనిపించట్లేదు. ఓ వ్యక్తి నుంచి కొంత నగదు తీసుకుని.. తిరిగి ఆ డబ్బులు చెల్లించలేకపోవడం.. ఆ ఒత్తిడితో ఇంటి నుంచి బయటకువెళ్లి.. అప్పటి నుంచి అతడి జాడలేదు. అయితే అదే రోజున.. 'పిల్లలను జాగ్రత్తగా చూసుకో అంటూ.. గడ్డి మందు తాగాను..' అని వాయిస్ మెసేజ్‌ను తన భార్య జానకి సెల్‌ఫోన్‌కు పంపారు. అప్పటినుంచి సతీష్‌కుమార్ జాడ లేదు. స్థానికంగా వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. భార్య జానకి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు కోరుతున్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

శ్రీకాకుళం క్రైం, మే 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని పీఎన్ కాలనీలో జీరో లైన్‌ని ఓ ఇంటిలో ఈ నెల 15న జరిగిన దొంగతనం కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు టూటౌన్ పోలీసులు సోమవారం తెలిపారు. ఈ నెల 15న పీఎన్‌కాలనీకి చెందిన గురుగుబిల్లి నందిని తన భర్తతో మామిడికాయలు లోడ్‌కు వెళ్లి తిరిగి రాత్రి ఇంటికి వచ్చేసరికి ప్రధాన ద్వారం తెరిచి ఉండడంతో ఇంటిలోకి వెళ్లి చూడగా సోనీ ఎల్‌ఈడీ టీవీ, శ్యాంసంగ్ ట్యాబ్, రూ.50 వేలు నగదు, చెవి రింగులు ఒక జత, వెండి పట్టీలు ఒక జత పోయాయని నిర్ధారించుకొని రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు టూటౌన్ ఎస్‌ఐ సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి.. జీరు సురేష్, బస మణిభూషణ రావులను అరెస్టు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రణస్థలం, మే 26(ఆంధ్రజ్యోతి): దన్నానపేట సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం చింతపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రణస్థలం నుంచి చింతపల్లి గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఎస్.బుల్లుబాబు, బోయిపాడు దన్నానపేట సమీపాన వెనుక నుంచి కారును ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వీరిద్దరూ శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ముగిసిన ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం


ఉలవల బస్తా పోటీలో విజేత గేదెల సత్యనారాయణ

పోలాకి, మే 26(ఆంధ్రజ్యోతి): గంటపేటలో ఈనెల 22 నుంచి ప్రారంభమైన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ 27 వార్షికోత్సవం సోమవారంతో ముగిసింది. స్వామి వారి తిరువీధి, కోలాట నృత్య ప్రదర్శన, గీతాపారాయణ, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం జిల్లాస్థాయి 150 కేజీల ఉలవల బస్తాల పోటీ నిర్వహించారు. ఒప్పంగికి చెందిన గేదెల సత్యనారాయణ, చింతువానిపేటకు చెందిన ఆవల వసంతరావు, ఎ.త్రినాథరావు మొదటి మూడు బహుమతులను వరుస గా సాధించారు. వీరికి నిర్వాహకులు, ధర్మకర్త తార రాజారావు తదితరు లు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉమా చంద్రమౌళేశ్వరుని ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం


సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

ఎల్.ఎన్.పేట, మే 26(ఆంధ్రజ్యోతి): పూశాం గ్రామంలో ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ ప్రారంభం, విగ్రహ, లింగ ప్రతిష్ఠోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి వివిధ కార్యక్రమాలను వేదపండితుడు సర్వాజ్యోస్యుల లక్ష్మీవెంకటగౌరీ వరప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో పురోహి తుడు నేతేటి వెంకటరమణమూర్తి పర్యవేక్షణలో రుత్వికులు చేపట్టారు. మహిళలు కలశాలతో ఆలయానికి చేరుకుని స్వామికి అభిషేకించారు. కార్యక్రమం మూడు రోజుల పాటు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

గ్రామదేవతకు ముర్రాటల సమర్పణ


కలశాలతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

మందస, మే 26(ఆంధ్రజ్యోతి): మందస గ్రామదేవత అన్నపూర్ణమ్మ ఆలయ 15వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు గోవింద దుధిష్టి ఆధ్వర్యంలో ప్రత్యేక హోమం, పూజలు చేపట్టారు. దేవర వీధి నుంచి మార్కెట్ రోడ్డు, మెయిన్‌రోడ్డు, శాసనం రోడ్డు మీదుగా కలశాలతో మహిళలు ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

అసంపూర్తి నిర్మాణంతో ఇక్కట్లు


రోడ్డు గోతుల్లో నిలిచిన వర్షపు నీరు

నందిగాం, మే 26(ఆంధ్రజ్యోతి): నందిగాం సర్వీసు రహదారి నుంచి పాలవలస వయా ఎస్సీ కాలనీ రోడ్డు పనులు అసంపూర్తిగా మిగలడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 300 మీటర్ల సీసీ రహదారి పూర్తికాకపోవడంతో గోతులమయమై ఏమాత్రం వర్షం కురిసినా గోతుల్లో నీరు చేరి వాహనచోదకులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. రోడ్డు పక్క కాలువల నిర్మాణం లేకపోవడంతో వర్షం, మురుగునీరు గోతుల్లో చేరి రోజుల తరబడి నిలిచిపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సిరుసువాడ-కుంటిభద్ర రోడ్డు అధ్వానం


వర్షపు నీటి నిల్వతో బురదమయంగా తయారైన రోడ్డు

కొత్తూరు, మే 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిరుసువాడ-కుంటిభద్ర రోడ్డు నిర్మాణంలో జాప్యంతో ప్రజలు పడుతున్న ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. గతంలో మూడు ప్రభుత్వాలు మారినా మా గ్రామాల రహదారిలో ఎటువంటి మార్పు లేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.2 కోట్లతో మండలంలో 27 రోడ్డు పనులు చేపట్టేందుకు గాను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శంకుస్థాపనలు చేశారు. ఈ పనుల్లో భాగంగా సిరుసువాడ-కుంటిభద్ర రోడ్డు కూడా ఉండడంతో ఆయా గ్రామస్థులు ఆనందం వ్యక్తంచేశారు. అయితే పనులు చేపట్టడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా నేటికీ రోడ్డు పనులు పూర్తి కాలేదు. దీంతో ఏమాత్రం వర్షం కురిసినా గోతుల్లో నీరుచేరి బురదమయంగా తయారై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ జేఈ దుర్గాప్రసాద్‌రావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా రోడ్డు పనులు ఆగిపోవటం వాస్తవమేనని, సమస్యను కాంట్రాక్టర్‌కు తెలిపి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు.

నిఘాను పటిష్ఠం చేయాలి


ఆర్డీవోకి వినతిపత్రం అందిస్తున్న నేతలు

టెక్కలి, మే 26(ఆంధ్రజ్యోతి): టెక్కలి పట్టణంలో నిఘాను మరింత పటిష్ఠం చేయాలని బీజేపీ నాయకులు హనుమంతు ఉదయభాస్కర్, వంజంగి వేణుగోపాల్, కూర్మారావు, జనసేన నాయకులు అట్టాడ శ్రీధర్ కోరారు. ఈ మేరకు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో విజయనగరంలో ఆ మూలాలు బయటపడుతున్న నేపథ్యం ఆందోళనకు గురిచేసిందన్నారు. పట్టణంలో ముస్లిం సామాజిక వర్గానికి చెందిన కొందరు రెక్కీ నిర్వహించినట్టు అనిపిస్తోందని, దీంతో స్థానికులు ఆవేదనకు గురవుతున్నారన్నారు.

ప్రజల చైతన్యానికి సాహిత్యం దోహదం

కొత్తూరు, మే 26(ఆంధ్రజ్యోతి): సమాజంలో మూఢ నమ్మకాలు, సామాజిక రుగ్మతలపై ప్రజలను చైతన్యం చేసేందుకు సాహిత్యం దోహదం చేస్తుందని ప్రముఖ సాహితీవేత్త పొట్నూరు కోటిబాబు అన్నారు. స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాల ఆవరణలో కొత్తూరు రచయితల వేదికను నిర్వహించారు. అనంతరం పలువురు కవులు తమ కవితలను చదివి వినిపించారు. కార్యక్రమంలో వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కుదుమ తిరుమలరావు, రచయితలు దుక్క గణపతిరావు, సీహెచ్ మార్క్స్, భైరి మురళి, బి.పద్మ, జన్ని నాగరాజు, జ్యోతి, కలమట శ్రీరాములు, ఎన్ని అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని వినతి

జలుమూరు, మే 26(ఆంధ్రజ్యోతి): జలుమూరు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని సమస్యలను పరిష్కరించాలని నరసన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మామిడి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ జె.రామారావుకు వినతిపత్రం అందించారు. కాలనీల్లో సరైన కాలువలు లేకపోవడంతో వాడుకనీరు రోడ్లపై నిలిచి ప్రజలు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీధి దీపాలు వెలగడం లేదని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కుళాయిల నుంచి తాగునీరు రావడం లేదని, ఇప్పటికైనా కాలనీల్లోని సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భేరి వెంకటరమణ, ఇజ్జురోతు రమణ, బొత్స రమణ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పోటీలో రోజారాణికి గోల్డ్ మెడల్

సంతబొమ్మాళి, మే 26(ఆంధ్రజ్యోతి): మర్రిపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అట్టాడ వెంకటరమణ భార్య రోజారాణికి భగవద్గీత పోటీలో గోల్డ్ మెడల్ సాధించింది. మైసూరు గణపతి సచ్చిదానంద ఆశ్రయం అవధూత దత్తపీఠం ఆన్‌లైన్‌లో నిర్వహించిన భగవద్గీత పోటీల్లో రోజారాణి ఈ ఘనత సాధించారు. ఈ మేరకు పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి సోమవారం బంగారు పతకం అందించారు.

ప్రభుత్వాధినేతలకు పాలభిషేకం


సీఎం ఫ్లెక్సీకి పాలభిషేకం చేస్తున్న డీలర్లు

ఎల్.ఎన్.పేట, మే 26(ఆంధ్రజ్యోతి): రేషన్ డిపోల్లో సరుకులు అందించేందుకు గాను ఎండీయూ వాహనాలను రద్దు చేయడంపై డీలర్లు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్ కల్యాణ్, మంత్రుల ఫ్లెక్సీకి సోమవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పాల భిషేకం చేశారు. కార్యక్రమంలో డీలర్ల సంఘ నేతలు ఎస్.వెంకటరావు, పి.శ్రీనివాసరావు, బి.చంద్రరావు, డీలర్లు పాల్గొన్నారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు చేపట్టాలి

నరసన్నపేట, మే 26(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌ఘడ్‌లో గత వారం ఎన్‌కౌంటర్‌లో అమరత్వం చెందిన మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు, ఇతర మావోయిస్టుల మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు నేతింటి నీలంరాజు, పీడీఎం నాయకులు పొదిలాపు దాలినాయుడు, జామాన వెంకట్రావు, ఏఐకేఎంఎస్ నాయకులు బైరి కూర్మారావు కోరారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ దుశ్చర్యలను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలన్నారు. ఆపరేషన్ కగార్‌ను నిలుపుదల చేసి మావోయిస్టులతో శాంతి చర్చలు చేపట్టాలని వారు కోరారు.

గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలి

● తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనుల ధర్నా

కొత్తూరు, మే 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న మా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పొనుటూరు పంచాయతీ బంకిబంజరుగూడ, బంకిగూడ, బంకి మెట్టుగూడ గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పిల్లా పాపలతో కలిసి సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులు ధర్నా చేశారు. ఇరవై ఏళ్ల కిందట ఒడిశా నుంచి వలస వచ్చి స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నామని, ఆధార్, రేషన్, ఉపాధి జాబ్‌కార్డు, ఓటు కార్డులను ప్రభుత్వం మంజూరు చేసిందని, అయితే కుల ధ్రువీకరణ పత్రాలు జారీలో జాప్యంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. అలాగే గ్రామాల్లో తాగునీరు, రోడ్డు సదుపాయం లేదని, పిల్లలకు చదువుకునేం దుకు పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు లేకపోవడంతో నాలుగు కిలోమీటర్లు దూరంలో ఉన్న పొనుటూరు వెళ్లాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ బాలకృష్ణకు అందించారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి పరిష్కా రానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు ఎస్.ప్రసాదరావు, సవర కలోడియా, సవర జయరాజ్, సవర పవుల్లో, ఎరస్టో, సవర పంజూ, అమృతషో, దశమంతు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న గిరిజనులు

కాలువలిలా.. రోడ్లు అలా..


ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఇలా..


ఇందిరానగర్ జంక్షన్ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

నరసన్నపేట, మే 26(ఆంధ్రజ్యోతి): స్థానిక మేజర్ పంచాయతీ నరసన్నపేటలో కాలువలు ఆక్రమణలకు గురికావడం, చెత్తను కాలువల్లో వేయడంతో మురుగు, వర్షపునీటి ప్రవాహానికి ఇబ్బందులు కలుగుతున్నాయి. కాలువల్లో సిల్ట్ పేరుకుపోవడంతో చెత్త రోడ్డు పక్కనే నిలిచిపోతోంది. దీంతో దుర్గంధం వెదజల్లి వివిధ పనులపై రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవు తున్నారు. పట్టణంలో పాతబస్టాండ్ నీలకంఠశ్వర స్వామి ఆలయం నుంచి సత్యవరం జంక్షన్ వరకు రెండువైపులా ఉన్న కాలువలు చెత్తలతో మూసుకుపోయాయి. అలాగే పాతబస్టాండ్, ఎల్ఐసీ కార్యాలయం, నేతాజీ వీధి జంక్షన్, కోవెల వీధి జంక్షన్ తదితర ప్రాంతాల్లో కాలు వలపై అక్రమ నిర్మాణాలతో మూసుకు పోయాయి. దీంతో దోమలు వ్యాప్తి చెంది వ్యాధులబారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వర్షపు నీరు ఈ చెత్తతో కలిసి మరింత ఇబ్బందులు పడుతున్నామని వాపో తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు. ఈ విషయమై ఈవో ద్రాక్షాయిణి వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తా వించగా.. కాలువల్లో చెత్త వేసిన వ్యా పారులకు నోటీసులిస్తామని, ఆక్రమణలు తొలగిస్తామన్నారు.

విద్యుత్ వృథా



సంతబొమ్మాళి, మే 26(ఆంధ్రజ్యోతి): నౌపడ సచివాలయంలో విద్యుత్ వృథా అవుతోంది. పని వేళలు ముగిసిన తర్వాత లైట్లు ఆపకుండా సిబ్బంది వెళ్లిపోతుండడంతో రాత్రంతా వెలుగుతున్నాయి. అలాగే ఫ్యాన్లు తిరుగుతున్నాయి. దీనిపై స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది.

పట్టణంలో భారీ వర్షం

నరసన్నపేట, మే 26(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో సోమవారం నరసన్నపేట పట్టణంతో పాటు పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజ లు మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఒక్కసారి ఆకాశం మేఘావృతమై సుమారు 30 నిమిషాల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పలు వీధులతో పాటు, ప్రధాన మార్గాలు జలమయమయ్యాయి. కిల్లాం-ముబుగాం రోడ్లపై ఆరబోసిన మొక్కజొన్న పంట పాడైంది. వేసవిలో వేసిన పెసర పంటలకు నష్టం వాటిల్లింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో నీరు చేరింది.

న్యూస్ బాక్స్

సీనియర్ న్యాయవాది 'ధవళ' మృతి

టెక్కలి, మే 26(ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది ధవళ రాజేశ్వరరావు(65) సోమవారం అనారోగ్యంతో తన నివాసంలో మృతిచెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రాజేశ్వరరావు మృతి పట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్, సీనియర్ న్యాయవాది దివ్వల వివేక్, కార్యవర్గ సభ్యులు సంతాపం తెలిపారు.

ఘనంగా సావిత్రి అమావాస్య పూజలు

పలాసరూరల్,మే26(ఆంధ్రజ్యోతి): పతి సౌభాగ్యం కోసం చేసే పూజగా పేరుపొందిన సావిత్రి అమావాస్య పూజలు సోమవారం మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తర్లాకోట, బ్రాహ్మణతర్లా, పండాశాసనంతో పాటు పలాస-కాశీబుగ్గ పెద్ద బ్రాహ్మణవీధి, పూజారివీధి, చిన్న బ్రాహ్మణ వీధిలోని మహిళలు వివిధ ఆలయాల్లో సావిత్రి అమావాస్య పూజలను నిర్వహించారు. పిండి వంటలు, తాటిముంజెలు, మామిడి, ఈతపండ్లను సమర్పించారు.

సబ్సిడీపై పశుదాణా

మెళియాపుట్టి, మే 26(ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు 50 శాతం రాయితీపై పశుదాణా అందిస్తున్నట్లు పశు సంవర్ధకశాఖ ఏడీ డా.మంచు కరణకరరావు తెలిపారు. సోమవారం మెళియాపుట్టిలో పాడి రైతులకు పశుదాణాను పంపిణీ చేశారు. 50 కిలోల బస్తా రూ.1110 కాగా సబ్సిడీపై రూ.555లకే అందజేస్తున్నామన్నారు. మొదటి విడతలో 157 మంది రైతులకు అందించడం జరుగుతుందన్నారు. ఆవుల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● సంతబొమ్మాళి, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో పాడి రైతులకు సబ్సిడీపై పశుదాణాను టెక్కలి పశు సంవర్ధక శాఖ ఏడీ డా.జయరాజ్ సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కూచెట్టి కాంతారావు పాల్గొన్నారు.

డిపోల వద్దే సరుకులివ్వాలి

టెక్కలి, మే 26(ఆంధ్రజ్యోతి): జూన్ నెల నుంచి నిత్యావసర సరుకులు డిపోల వద్దే అందించాలని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వ హించారు. ప్రతినెల ఒకటవ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు డిపోలను తెరిచి ఉంచాలన్నారు. 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు వృద్ధులు, దివ్యాంగులు ఇళ్లకు వెళ్లి నిత్యావసర సరుకులు అందించడం జరుగుతుందన్నారు. డీటీ అనిల్‌కుమార్ పాత్రో పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయండి

వజ్రపుకొత్తూరు, మే 26(ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు నుంచి బెండిగేటు వరకు నిలిపోయిన ఆర్ అండ్‌బీ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు కార్యవర్గ సభ్యుడు కె.మోహనరావు కోరారు. ఈ మేర కు సోమవారం బెండిలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పోరు యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడేళ్లుగా పనులు నిలిచిపోవడంతో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు గణపతి, కె.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో రైస్ పుల్లింగ్ ముఠా?

శ్రీకాకుళం, మే 26(ఆంధ్రజ్యోతి): పోలీసులకు రైస్ పుల్లింగ్ ముఠా చిక్కినట్టు సమాచారం. సరుబుజ్జిలి మండలం పరిధిలోని ఏజెన్సీ ప్రాంతంలో మహిమ గల ఇత్తడి చెంబు.. దానికి మరో పేరుగా కోరికలు తీర్చే 'అక్షయపాత్ర'గా ప్రచారం చేసుకుంటూ ఆరుగురి నుంచి లక్షల రూపాయలు ఓ ముఠా వసూలు చేసినట్టు తెలిసింది. ఈ విషయం సరుబుజ్జిలి, ఆమదాలవలస పోలీసులకు చేరింది. సోమవారం పది మందిని పోలీసులు అదుపులోకి తీసుకోగా.. వీరిలో ఆరుగురు బాధితులు ఉండడంతో వారిని విడిచిపెట్టినట్లు సమాచారం. మిగిలిన నలుగురు రైస్ పుల్లింగ్ ముఠాగా తేలడంతో వారిని విచారిస్తున్నట్లు సమాచారం.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పలాస/పోలాకి/పాతపట్నం/సంతబొమ్మాళి, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యం సిద్ధిస్తుందని పలువురు వక్తలు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పలాస, పోలాకి, పాతపట్నం, సంతబొమ్మాళి కార్యాలయాల్లో సోమవారం యోగాసనాలు వేశారు. పలాసలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, మునిసిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ ఎన్.రామారావు తదితరులు పాల్గొన్నారు. యోగాకు ప్రపంచ స్థాయి గుర్తింపు ఉందని బాబూరావు అన్నారు.

యోగాతో మానసిక ఆనందం

● యోగా సాధన ద్వారా మానసిక ఆనందం పొందవచ్చని పోలాకి తహసీల్దార్ పొన్నాడ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ బి.పద్మావతి, సూపరింటెండెంట్ బలగ సూర్యప్రకాష్, యోగా శిక్షకులు ముద్దాడ హైమావతి తదితరులు పాల్గొన్నారు.


పోలాకి: యోగా సాధన చేస్తున్న అధికారులు



పలాస: యోగాపై మాట్లాడుతున్న ఏపీటీపీసీ చైర్మన్ బాబూరావు

హోమియో వైద్యశాలలో..

● యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందగలుగుతామని హోమియో వైద్యురాలు ఎస్.ఉమాగౌరీ అన్నారు. యోగా మాసోత్సవాల్లో భాగంగా పాతపట్నం మండలం తెంబూరు ఆయుష్ హోమియో వైద్యశాలలో యోగాపై శిక్షణ నిర్వహించారు.

యోగాంధ్ర-2025పై శిక్షణ

● సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి డా.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సచివాలయంలో యోగాంధ్ర-2025పై సోమవారం అవగాహన కల్పించారు. యోగాతో ప్రతి ఒక్కరి ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.


సంతబొమ్మాళి: యోగాసనాలు వేస్తున్న సిబ్బంది

సర్వే సక్రమంగా నిర్వహించాలి

నందిగాం, మే 26(ఆంధ్రజ్యోతి): యోగాతో వ్యాధులు దూరమవుతాయని, తద్వారా మానసిక, శారీరక వికాసం కలుగుతుం దని జడ్పీ సీఈవో డి.సత్యనారాయణ అ న్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాల యంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్రపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కలిగించాలన్నారు. యోగా సర్వే వేగవంతం చే యాలన్నారు. సర్వేలో మండలం వెనుక బడి ఉందని, అందువల్ల సిబ్బంది బాధ్య తగా వ్యవహరించాలన్నారు. మండలంలో జూన్ 21న నిర్వహించే యోగా కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుమార్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.